

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No.37ACDFM5465G1Z1

No: KNL/3`78(D)/2026`2028


Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 187 పేజీలు - 08 వెల - 05/- శనివారం 04-07-2026


వివాహానికి హాజరైన బుగ్గన అర్జున్ రెడ్డి



# ఎస్ఐఆర్ నిలిపేయండి..




- సుప్రీంకోర్టుకు విపక్షాల వినతి
- సుప్రీంకోర్టుకు 23 మంది విపక్ష నేతల లేఖ
- ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరం
- ఈవీఎంలపై ప్రజా చర్చ కోరిన విపక్షాలు
- కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ
- ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వ్యాఖ్య

దేశ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని ఆరోపించాయి.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు 23 మంది విపక్ష నేతలు ఈ లేఖపై సంతకం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల అసలు తీర్పు ప్రతిబింబించడం లేదని ఆరోపించారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల సూత్రాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయ ఉద్దేశాలతో జరుగుతోందని విపక్షాలు ఆరోపించాయి. సరైన పత్రాలు లేని పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నాయి. లక్షలాది మంది నిజమైన ఓటర్లు జాబితాల నుంచి తొలగింపునకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి.






## బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?..

కేసీఆర్‌కు భట్టి సవాల్!

హరీశ్‌పై భట్టి తీవ్ర విమర్శలు

అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్

కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ భారం తగ్గించిందన్న డిప్యూటీ సీఎం

సింగరేణిని బీఆర్ఎస్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శ

2

## లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తా.. మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా?



తెలంగాణ అప్పులపై చర్చకు తాను సిద్ధమన్న జూపల్లి

సాయంత్రం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తానన్న మంత్రి

పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందామని సవాల్

తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. "తెలంగాణ అప్పులపై చర్చకు నేను సిద్ధం. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు సాయంత్రం 5 గంటలకు వస్తా. మరి బీఆర్ఎస్ నేతలు సిద్ధమేనా?" అంటూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. "ఖబడ్దార్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందాం రండి" అని ధ్వజమెత్తారు.

వార్త 2లో



2

## 'రామాలయ దోపిడీని హిందువులు క్షమించరు'.. బీజేపీపై ఉద్ధవ్ ఠాక్రే ఫైర్

## అప్పుల లెక్కల్లో పొంతన లేదు.. మంత్రి చెప్పింది ఒకటి.. సీఎం చెప్పింది మరొకటి: హరీశ్ రావు



రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని, ప్రభుత్వ పెద్దల మధ్యే లెక్కల్లో పొంతన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన 'ఎస్ఐఆర్'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

వార్త 2లో




## ప్రధాని మోదీకి 'చిన్న చెల్లెలు' వచ్చింది!

వార్త 2లో

# బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?..

**కేసీఆర్‌కు భట్టి సవాల్!**

**హరీశ్‌పై భట్టి తీవ్ర విమర్శలు**

**అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్**

**కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ భారం తగ్గించిందన్న డిప్యూటీ సీఎం**

**సింగరేణిని బీఆర్ఎస్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శ**

హైదరాబాద్,

తెలంగాణ అప్పులపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘాటు ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో భారీ అప్పులు చేశారని అన్నారు. అప్పులపై కేసీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులు, ఆర్థిక వ్యవహారాలపై వివరాలు వెల్లడించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు భట్టి తెలిపారు. ఇందులో చెల్లించకుండా వదిలేసిన బకాయిలు కూడా ఉన్నాయని చెప్పారు. పదేళ్ల పాలన అబద్ధాల పునాదులపై సాగిందని విమర్శించారు. ఈ భారీ అప్పులపై మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వ అప్పుల కారణంగా రెండున్నరేళ్లలో అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని భట్టి చెప్పారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. అధిక వడ్డీ అప్పులను రీస్ట్రక్చరింగ్ చేయడం వల్ల వార్షిక వడ్డీ భారం రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గిందని వివరించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సింగరేణిని సంక్షోభంలోకి నెట్టిందని భట్టి ఆరోపించారు. కొత్త కోల్ బ్లాకులు తీసుకురాలేదని విమర్శించారు. బొగ్గు మాయం ఆరోపణలపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కొత్త కోల్ బ్లాకుల కోసం కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తా.. మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా?:

**తెలంగాణ అప్పులపై చర్చకు తాను సిద్ధమన్న జూపల్లి**

**సాయంత్రం 5 గంటలకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తానన్న మంత్రి**

**పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందామని సవాల్**

హైదరాబాద్,

తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. "తెలంగాణ అప్పులపై చర్చకు నేను సిద్ధం. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు సాయంత్రం 5 గంటలకు వస్తా. మరి బీఆర్ఎస్ నేతలు సిద్ధమేనా?" అంటూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. "ఖబడ్దార్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందాం రండి" అని ధ్వజమెత్తారు. తన లెక్కలు తప్పు అయితే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు తక్షణమే రాజీనామా చేస్తానని, మరి వారి లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్పే లెక్కలు నిజమేనని మీడియా ముందు ఒప్పుకోవాలని అన్నారు.అసెంబ్లీలో రాష్ట్ర అప్పులపై కేటీఆర్, హరీశ్‌రావు ఒక్కొక్కరు ఒక్కో రకమైన అబద్ధపు లెక్కలు చెప్పారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంపై ఏకంగా రూ.8,21,651 కోట్ల అప్పుల భారం మోపారని ఆయన మండిపడ్డారు. కార్పొరేషన్ల ద్వారా దొంగచాటుగా తెచ్చిన అప్పులను వీరు ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. తాను ఆత్మగౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, వ్యాపారాలు చేసుకుని రాజకీయాల్లోకి వచ్చానని.. పారిపోయే లక్షణం తనకు లేదని, అబద్ధాలు చెప్పే అలవాటు అంతకన్నా లేదని స్పష్టం చేశారు.

# 'రామాలయ దోపిడీని హిందువులు క్షమించరు'..

**బీజేపీపై ఉద్ధవ్ ఠాక్రే ఫైర్**

**అయోధ్య రామాలయం చుట్టూ మరోసారి రాజకీయాలు**

**రామాలయ విరాళాలపై ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర ఆరోపణలు చేశారు.**

**జూలై 6న 'రామ్ రక్ష' పేరుతో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపు**

**దాదర్‌లోని హనుమాన్ ఆలయం వద్ద తొలి నిరసన**

**విరాళాల లెక్కలు చెప్పాలని డిమాండ్**

అయోధ్య రామాలయానికి భక్తులు ఇచ్చిన విరాళాలను దోచుకున్నారంటూ బీజేపీపై శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై పూర్తి లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. జూలై 6న సాయంత్రం ముంబైలోని దాదర్ కబూతర్‌ఖానా హనుమాన్ ఆలయం వద్ద 'రామ్ రక్ష' నిరసన నిర్వహిస్తామని తెలిపారు.పార్టీలకు అతీతంగా ప్రతి హిందువు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఉద్ధవ్ పిలుపునిచ్చారు. రామ్ రక్షా స్తోత్రం, హనుమాన్ స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తామని చెప్పారు. తాను స్వయంగా పార్టీ నేతలు, శివసైనికులతో కలిసి నిరసనకు నాయకత్వం వహిస్తానని వెల్లడించారు.రామ జన్మభూమి ఉద్యమం వల్లే బీజేపీ ఎదిగిందని ఉద్ధవ్ అన్నారు. ఇప్పుడు అదే రామాలయ విరాళాలపై అవినీతి ఆరోపణలు రావడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఆలయ నిధులను రాజకీయ అవసరాలకు, ఇతర పార్టీల్లో చీలికలు తీసుకురావడానికి వినియోగిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు.దాదర్‌లోని నిరసనతో ఉద్యమం ముగియదని ఉద్ధవ్ స్పష్టం చేశారు. అనంతరం మహారాష్ట్రలోని అన్ని జిల్లాలు, పట్టణాలు, గ్రామాల్లో రామాలయాలు, హనుమాన్ ఆలయాల వద్ద ఇదే తరహా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రామాలయాన్ని దోచుకున్న వారిని హిందువులు క్షమించరని హెచ్చరించారు.



# ఎస్ఐఆర్ నిలిపేయండి..

**సుప్రీంకోర్టుకు విపక్షాల వినతి**

**సుప్రీంకోర్టుకు 23 మంది విపక్ష నేతల లేఖ**

**ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరం**

**ఈవీఎంలపై ప్రజా చర్చ కోరిన విపక్షాలు**

**కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ**

**ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వ్యాఖ్య**




హైదరాబాద్,

దేశ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని ఆరోపించాయి.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు 23 మంది విపక్ష నేతలు ఈ లేఖపై సంతకం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల అసలు తీర్పు ప్రతిబింబించడం లేదని ఆరోపించారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల సూత్రాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయ ఉద్దేశాలతో జరుగుతోందని విపక్షాలు ఆరోపించాయి. సరైన పత్రాలు లేని పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నాయి. లక్షలాది మంది నిజమైన ఓటర్లు జాబితాల నుంచి తొలగింపునకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి.పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని లేఖలో పేర్కొన్నారు. 'లాజికల్ డిస్‌క్రిపెన్సీ' పేరుతో ఈ తొలగింపులు జరిగాయని తెలిపారు. ఒక న్యాయ ట్రిబ్యునల్ పరిశీలించిన 1,777 కేసుల్లో 1,717 తొలగింపులు తప్పుగా జరిగాయని గుర్తించినట్లు వెల్లడించారు.ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కూడా ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని విపక్షాలు తెలిపాయి. అవసరమైతే బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి పరిశీలించాలని సూచించాయి. దీనిపై విస్తృత ప్రజా చర్చ జరగాలని కోరాయి.సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలపై రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించాయి. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవస్థలను వినియోగిస్తున్నారని పేర్కొన్నాయి. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత సుప్రీంకోర్టుదేనని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తక్షణ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టును కోరారు.



# అప్పుల లెక్కల్లో పొంతన లేదు.. మంత్రి చెప్పింది ఒకటి.. సీఎం చెప్పింది మరొకటి: హరీశ్ రావు

**రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందన్న హరీశ్ రావు**

**సంగారెడ్డిలో జరిగిన అవగాహన సదస్సులో ప్రభుత్వ తీరుపై విమర్శలు**

**మంత్రి జూపల్లి లేఖ ప్రకారం అప్పు రూ.1.77 లక్షల కోట్లు అని వెల్లడి**

**అసెంబ్లీలో సీఎం చెప్పిన అప్పు రూ.3.45 లక్షల కోట్లు అని గుర్తు చేసిన మాజీ మంత్రి**

**ప్రభుత్వ పెద్దల లెక్కల్లోనే తేడాలు ఉన్నాయని ఆరోపణ**

హైదరాబాద్,

రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని, ప్రభుత్వ పెద్దల మధ్యే లెక్కల్లో పొంతన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన 'ఎస్ఐఆర్'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం చేసిన అప్పు రూ. 1,77,068 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా తనకు లేఖ రాశారని తెలిపారు. అయితే, ఇదే అంశంపై నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం చేసిన అప్పు రూ. 3,46,294 కోట్లు అని చెప్పారని ఆయన గుర్తుచేశారు.ఒకే ప్రభుత్వంలోని మంత్రి ఒక లెక్క, ముఖ్యమంత్రి మరో లెక్క చెప్పడం గందరగోళానికి దారితీస్తోందని హరీశ్ రావు అన్నారు. అప్పుల విషయంలో ప్రభుత్వ పెద్దలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ లెక్కల్లో ఏది నిజమో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రధాని మోదీకి 'చిన్న చెల్లెలు' వచ్చింది!

**జపాన్ ప్రధానిని చెల్లెలుగా సంబోధించిన ప్రధాని మోదీ**

**షింజో అబేను అన్నయ్యగా భావించేదాన్నని వెల్లడించిన తకాయిచి**

**తొలి భారత పర్యటనకు వచ్చిన జపాన్ తొలి మహిళా ప్రధాని తకాయిచి**

హైదరాబాద్,

భారత్, జపాన్ దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు నూతన శిఖరాలకు చేరుతున్నాయి. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, ఇరు దేశాల అధినేతల మధ్య నెలకొన్న బలమైన వ్యక్తిగత అనుబంధానికి నిదర్శనంగా నిలిచి ఒక అరుదైన సన్నివేశం న్యూఢిల్లీలో ఆవిష్కృతమైంది. జపాన్ ప్రధానమంత్రి సనాయ్ తకాయిచిని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంతో ఆత్మీయంగా తన 'చెల్లెలు' అని సంబోధించారు.న్యూఢిల్లీ వేదికగా జరిగిన 16వ భారత్-జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఈ ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. హైదరాబాద్ హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో, దివంగత మాజీ ప్రధాని షింజో అబేను తాను సొంత అన్నయ్యలా భావించేదాన్నని తకాయిచి గుర్తుచేసుకున్నారు. అబేకు ప్రధాని మోదీ అత్యంత సన్నిహితులు కావడంతో, తనూ ఆయనను అదే దృష్టితో చూస్తున్నానని ఆమె పేర్కొన్నారు. దీనికి స్పందించిన మోదీ, ఆమెను 'చిన్న చెల్లెలు' అని సంబోధించారు. ఈ అనుబంధంతోనే ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఇరు నేతలు ఆకాంక్షించారు.జపాన్ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తకాయిచి భారత్‌లో జరిపిన తొలి అధికారిక పర్యటన ఇది. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య చరిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా రక్షణ రంగంలో సంయుక్త అభివృద్ధి కోసం తొలిసారిగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆర్థిక, ఇంధన భద్రతపై ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించడంతో పాటు, రానున్న పదేళ్లలో జపాన్ నుంచి 10 ట్రిలియన్ యెన్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.ఈ సదస్సు ఇరు దేశాల మధ్య నెలకొన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఒక నూతన అధ్యాయానికి నాంది అని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, ఇంధన రంగాల్లో పరస్పర సహకారంపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. స్వేచ్ఛాయుతమైన, నియమ నిబంధనలతో కూడిన ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం కలిసి పనిచేయాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు.

# మహారాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం... స్కూళ్ల వద్ద 'స్టింగ్' అమ్మకాలపై నిషేధం

**పాఠశాలలకు 500 మీటర్ల పరిధిలో అమ్మకాలు నిషిద్ధం**

**విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని ప్రభుత్వ నిర్ణయం**

**నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు**

**మత్తు పదార్థాల అమ్మకాలపైనా చర్యలుంటాయని హెచ్చరిక**




హైదరాబాద్,

మహారాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్న ఆందోళనల నేపథ్యంలో, ప్రముఖ ఎనర్జీ డ్రింక్ 'స్టింగ్' విక్రయాలపై ఆంక్షలు విధించింది. రాష్ట్రంలోని పాఠశాలలకు 500 మీటర్ల పరిధిలో స్టింగ్ ఎనర్జీ డ్రింక్‌తో పాటు మత్తు పదార్థాలను విక్రయించడాన్ని నిషేధిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.శుక్రవారం రాష్ట్ర శాసనసభలో బీజేపీ ఎమ్మెల్యే విక్రమ్ అడిగిన ప్రశ్నకు ఆహార, ఔషధ పరిపాలన (ఎఫ్‌డీఏ) శాఖ మంత్రి నరహరి జిర్వాల్ సమాధానమిచ్చారు. స్టింగ్ వంటి పానీయాల్లో ఉండే కొన్ని పదార్థాలు పాఠశాల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, ఈ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సభకు వివరించారు. ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ఎఫ్‌డీఏ అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.పాఠశాల ప్రాంగణాలకు 500 మీటర్ల లోపు ఎవరైనా ఈ ఎనర్జీ డ్రింక్స్ లేదా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే, వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి జిర్వాల్ హెచ్చరించారు. మరోవైపు, ఎనర్జీ డ్రింక్స్ వల్ల కలిగే ఆరోగ్య నష్టాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేలా పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది.ఈ చర్చ సందర్భంలో పలువురు ఎమ్మెల్యేలు సైతం చిన్నారులకు ఇటువంటి పానీయాలు అందుబాటులో లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎనర్జీ డ్రింక్స్‌లో ఉండే అధిక కెఫిన్, చక్కెర నిష్పత్తి విద్యార్థుల నిద్ర, ప్రవర్తన మరియు ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆరోగ్య నిపుణులు చాలాకాలంగా హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మహారాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.

# గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటుకు కుట్ర.. 8 మంది అరెస్ట్..

ఇంటర్‌నెట్ డెస్క్:

గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు కోసం ఉగ్రవాద సంస్థ జైష్-ఎ-మహ్మద్ చేసిన కుట్ర వెలుగులోకి వచ్చింది. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్.. గుజరాత్, మధ్యప్రదేశ్‌లో 8 మందిని అరెస్ట్ చేసింది. గుజరాత్ ఏటీఎస్ అధికారులు గురువారం గుజరాత్‌లోని బనస్కాంత, పటాన్, నవ్‌సారితో పాటు పొరుగు రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని దేవాస్ ప్రాంతంలో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఈ 8 మందిని అదుపులోకి తీసుకున్నారు.నిందితులను అహ్మద్ గాజీవాలా, ఇబ్రహీం ఘూఘా, ముదస్సిర్ గాజీవాలా, జకారియా దురానీ, ముఫ్తీ ఫౌజాన్ దౌవా, మహ్మద్ అమీన్ పాలన్‌పురి, మహ్మద్ అబ్దుల్ సాఫ్దీ, బిలాల్ దురానీ ఘూఘాగా గుర్తించారు. వీరిలో ముగ్గురు సిద్ధ్‌పూర్, చిఖ్లీలోని మతపరమైన విద్యాసంస్థలతో సంబంధం ఉన్నట్లు తేలింది.

# వివాహానికి హాజరైన బుగ్గన అర్జున్ రెడ్డి

పల్లెవెలుగు బేతంచెర్ల ప్రతినిధి (జులై 3):--- మండల పరిధిలోని బుగ్గానపల్లి తండా



గ్రామా నికి చెందిన సుగాలి చిన్న రాముడు xూూ( సెక్రెటరీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషనర్ విజయవాడ) ఒసుగాలి లక్ష్మీబాయి దంపతుల కుమారుడు సుగాలి నేనావత్ మధు సాయి నాయక్ ఒ మాల్యా మౌనిక బాయి వీరి వివాహం బేతంచెర్ల పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి దేవి కళ్యాణ మండపం లో జరిగినది ఈ వివాహానికి హాజరైన రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డితనయుడు యువ నాయకులు బుగ్గన అర్జున్ రెడ్డి నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. బుగ్గన అర్జున్ రెడ్డి వెంట ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, మద్దిలేటి స్వామి మాజీ చైర్మన్ జన లక్ష్మి రెడ్డి, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర రెడ్డి, టౌన్ ఉపాధ్యక్షులు అడపాల తిరుమలేష్ తదితరులు పాల్గొని నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

# బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

మహానంది, పల్లె వెలుగు వివిధ సమస్యలపై స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం





జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ పేర్కొన్నారు. శుక్రవారం మహానంది పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన బాధితులతో ఎస్పీ మాట్లాడి, వారి సమస్యలు , ఇబ్బందులు,ఫిర్యాదులపై స్పందన ఎలా ఉందనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలు గురించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వివిధ కేసులలో పట్టుబడిన వాహనాల గురించి ఆరా తీశారు. అధికారులు, సిబ్బంది స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడికి తక్షణమే స్పందించి చట్టపరిధిలో న్యాయం చేయాలన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని, బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ఎస్పీ వెంట నంద్యాల ఏఎస్పీ జావలి,తాలుకా రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ ఐ ఎన్.రామ్మోహన్ రెడ్డి, సిబ్బంది, పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

మహానంది, పల్లె వెలుగు గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా





పనిచేస్తున్నామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో రూ. 1 కోటి వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..గ్రామాల



అభివృద్ధి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పన లక్ష్యంగా ఈ పనులు చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, మండల కన్వీనర్ కంచర్ల శివయ్య, మండల క్లస్టర్ ఇన్చార్జి నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, గంగవరపు శశికళ కొండారెడ్డి, రవి స్వామి, బిజెపి మండల కన్వీనర్ పడకండ్ల నాగేశ్వరరావు, భాష్యం రాముడు గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు ఉల్లి మధు, హరి ప్రసాద్ రెడ్డి, రాజశేఖర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్ ప్రమాద మృతులకు అశ్రునివాళి.

**● విశాఖ స్టీల్ ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని,కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాలి. ● నంద్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన. ● కేంద్ర,రాష్ట్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక డిమాండ్.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. విశాఖ స్టీల్ ఎస్ఎంఎస్ దుర్ఘటనలో 10 మంది కార్మికులను కోల్పోవడం బాధాకరం. ఇటువంటి దుర్ఘటన గతంలో ఎన్నడూ చూడలేదు. ఇది ప్రమాదం కాదు. ప్రభుత్వ వైఫల్యం. మానవ తప్పిదం. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల దుష్ఫలితం. విశాఖ స్టీల్ । ప్రమాద మృతులకు న్యాయం చేయాలని కోరుతూ, విశాఖ స్టీల్ప్లాంట్ ప్రమాద మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలి. గాయపడిన వారికి రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలి. న్యాయ విచారణ జరిపి । దోషులను శిక్షించాలి. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ను పాటించాలి. నాణ్యమైన రామెటీరియల్ను ఉపయోగించాలి. నాశిరకం మెటీరియల్ను కొనుగోలు చేసిన వారిని గుర్తించి శిక్షించాలి. భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు మద్దతుగా సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు కే మహమ్మద్ గౌస్ ఏ ఐ టియు సి పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు అధ్యక్షులు వి.యేసు రత్నం, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు సిఐటియు జిల్లా కార్యదర్శి డి లక్ష్మణ్,పట్టణ కార్యదర్శి పి వెంకట లింగం,ఏఐటియుసి పట్టణ కార్యదర్శి ధనుంజయుడు, ఐ ఎఫ్ టి యు డివిజన్ కార్యదర్శి చౌడప్ప వీరితోపాటు కార్మిక సంఘాల నాయకులు కార్యకర్తలు 100 మంది పాల్గొనడం జరిగింది. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కే రామాంజనేయులు, ఐ ఎఫ్ టి యు డివిజన్ కార్యదర్శి చౌడప్పలు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ లో జరిగిన ఘటన ను పరామర్శించడానికి వచ్చిన మంత్రివర్యులు లోకేష్ కార్మికులకు పరిహారంపై అడిగినప్పుడు మీ ఇంట్లోవారు చనిపోయారా? అంటూ వ్యంగ్యంగా మాట్లాడ్డం, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ మీడియా ముందు విలేకరుల ప్రశ్నకు జరిగిన దుర్ఘటనపై నాకు అంత అవగాహన లేదంటూ మాట్లాడ్డం సరైనది కాదని అన్నారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగితే తక్షణమే ప్రాథమిక విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలి. కానీ హుటాహుటిన తరలి వచ్చిన పెద్దలు ఎవరిని కాపాడేందుకో కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు. ఆ కమిటీ నిష్పక్షపాతంగా కార్మిక సంఘాలతో, కార్మికులు, అధికారులతో విస్తృతంగా సంప్రదింపులు జరుపుకుండా వెళ్లిపోయింది. అసలు దోషులు ఎవరని ప్రశ్నించారు. రూ. 11440 కోట్లు ప్రకటించి అధికారాలన్నీ తమ చెప్పు చేతుల్లోకి తీసుకొని, ప్రధానమైన మెయింటెనెన్స్ పనులకు ఒక రూపాయి కూడా కేటాయించని పీఎంఓ దా? అన్ని తానై నడుపుతున్న । స్టీల్ సెక్రటరీదా? స్టీల్ ప్లాంట్ ను మూసేయాలనే ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ప్లాంటును నడిపిస్తున్నారని ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు కార్మిక వర్గం అంతా సిద్ధంగా ఉందని రాబోయే కాలంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# సమన్వయమే విజయానికి చిహ్నం..!

**ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన సజావుగా ముగింపు**

**అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశంసల జల్లు.. కీలక పాత్ర పోషించిన ఈడీ కె. తులసి దేవి**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం. నాయక్ అధికారిక పర్యటన నంద్యాల జిల్లాలో అత్యంత విజయవంతంగా ముగిసింది. పర్యటన మొత్తం ముందస్తు ప్రణాళికతో, క్రమశిక్షణతో, వివిధ శాఖల సమన్వయంతో సాగడం అధికార యంత్రాంగం యొక్క అద్భుత పనితీరుకు అద్దం పట్టిందని పలువురు కొనియాడారు.

**సమర్థవంతమైన ప్రణాళిక.. పరిపాలనా నైపుణ్యం**

ఈ పర్యటనను విజయవంతంగా నిర్వహించడంలో నంద్యాల జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్‌గా, ఉమ్మడి జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా (ఈడీ) బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. తులసి దేవి కీలక పాత్ర పోషించారు. పర్యటనకు ముందు నుంచే ఆమె సమగ్ర ప్రణాళికతో వ్యవహరించి అన్ని శాఖల మధ్య సమన్వయం కుదిర్చారు. సమావేశాల ఏర్పాట్లు, అధికారిక కార్యక్రమాల నిర్వహణను ఎక్కడా ఎలాంటి అంతరాయం లేకుండా పకడ్బందీగా నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమాన్ని సమయపాలనతో పూర్తి చేయడంలో ఆమె చూపిన చొరవ, పరిపాలనా నైపుణ్యం ప్రస్తుతం అధికార వర్గాల్లో ప్రత్యేకంగా చర్చనీయాంశమైంది.

**అధికారులు, సామాజిక సంఘాల అభినందనలు**

ఎస్సీ వర్గాల సంక్షేమం, సంక్షేమ పథకాల అమలు, విద్యార్థుల వసతి గృహాల అభివృద్ధి వంటి కీలక అంశాలపై నిరంతర దృష్టితో ప్రజలకు చేరువగా పనిచేస్తున్న కె. తులసి దేవి సేవలను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ పర్యటన ఇంతటి ఘన విజయం సాధించడం వెనుక ఆమె చూపిన అంకితభావం, సమర్థవంతమైన సమన్వయమే ప్రధాన కారణమని అధికార వర్గాల్లో విస్తృతంగా అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఉపాధ్యాయులు దేశ నిర్మాతలు- ఎమ్మెల్యే బీవీ,

**● పదవి విరమణ ఉపాధ్యాయుడు నర్సప్పను సన్మానం చేసిన,,,,, ● ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి,,,, ● పదవి విరమణ ఉపాధ్యాయులు ఈటె నరసప్ప ను సన్మానం చేస్తున్న ,,,, ● ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి**



ఎమ్మిగనూరు పల్లె వెలుగు జులై 3 ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్ది దేశ నిర్మాతలుగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఈటె నరసప్ప పదవి విరమణ సన్మాన సభ ఘనంగా నిర్వహించబడింది. సన్మాన సభ

ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, తన చేతుల మీదుగా ఈటె నరసప్ప గారిని శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాణ శిల్పులని, వారి త్యాగం, కృషి, అంకితభావం వల్లే భావితరాలు తీర్చిదిద్దబడతాయని అన్నారు. ఉపాధ్యాయులను సరస్వతి పుత్రులుగా అభివర్ణిస్తూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం వారు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ఈట నరసప్ప తన సుదీర్ఘ సేవా కాలంలో ఆదర్శ ఉపాధ్యాయుడిగా సేవలందించి విద్యారంగానికి విశేష కృషి చేశారని ప్రశంసించారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. డిప్యూటీ డీఈఓ రాజేంద్ర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు బి. నాగభూషణ రెడ్డి, ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈటె నరసప్ప క్రమశిక్షణ, సేవాభావం, అంకితభావంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఆదర్శ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ ఎం. సుధాకర్ (ఎస్.ఏ. జీవశాస్త్రం), ఎం. మురళీధర్ (ఎస్.ఏ. తెలుగు), సీనియర్ ఉపాధ్యాయులు ఎం. ఈరన్న, పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కలిసి ఈటె నరసప్ప కి ఆత్మీయంగా వీడ్కోలు పలికి, వారి భవిష్యత్ జీవితం ఆనందమయం, ఆరోగ్యవంతంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఇన్చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా చంద్రమౌళి



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 3 : బండి ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ ఇన్చార్జి డిప్యూటీ ఎంపీడీవో గా చంద్రమౌళి శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిప్యూటీ ఎంపీడీవో గా పని చేస్తున్న అన్నం పురుషోత్తం గత నెల 11వ తేదీ నుండి అనారోగ్య కారణాల కారణంగా సెలవు పై వెళ్ళిపోయారు. ఆనాటి నుండి డిప్యూటీ ఎంపీడీవో పోస్ట్ ఖాళీగా ఉంది. బండి ఆత్మకూరు స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు లో డిప్యూటీ ఎంపీడీవో గా ఉన్న చంద్రమౌళిని ఇన్చార్జి డిప్యూటీ ఎంపీడీవో గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పదవీ బాధ్యతలు చేపట్టిన చంద్రమౌళి శుక్రవారం లింగాపురం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని హరిజనవాడలో ఓవర్ హెడ్ ట్యాంకు సంబంధించి న విద్యుత్ మోటారు కాలిపోయింది. గ్రామాన్ని సందర్శించిన డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి మోటార్ ను బాగు చేయిస్తామని పేర్కొన్నారు.

**ఇన్చార్జి కార్యదర్శి నియామకంపై భిన్నాభిప్రాయాలు**

బండి ఆత్మకూరులో సచివాలయం వన్ లో ఇంచార్జి కార్యదర్శి నియామకంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక్కడ కార్యదర్శిగా పనిచేస్తున్న అక్బర్ పదోన్నతి పై కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సంత జుటూరు పంచాయతీ కార్యదర్శి వెంకట చౌడయ్యను బండి ఆత్మకూరు ఇన్చార్జి కార్యదర్శిగా నియమించారు. వెంకట చౌడయ్య స్వగ్రామం బండి ఆత్మకూరు కావడంతో, ఇన్చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఎంపీడీవో ఎలా నిర్ణయం తీసుకున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇన్చార్జి అయినప్పటికీ సొంత గ్రామంలో పనిచేసేలా అధికారులు నిర్ణయం తీసుకున్న ఆలోచన విధానాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు.

# ఆకాశం వైపు కళ్లూ, నేలపై కన్నీళ్లు!

**వరుణుడు జాడలేదు... డ్యాంలో నీరు లేదు... వెక్కిరిస్తున్న మేఘాలు...**



హోళగుంద పల్లె వెలుగు జులై :03 హోళగుంద మండలంలో రైతు గుండె చప్పుడు వినిపిస్తోంది. వర్షాకాలం మొదలై రోజులు గడుస్తున్నా వరుణుడు మాత్రం కనికరించడం లేదు. ఆకాశంలో మేఘాలు కనిపిస్తున్నాయి... ఆశలు రేపుతున్నాయి... కానీ ఒక్క చినుకు కూడా కురవకుండా వెళ్లిపోతూ రైతులను వెక్కిరిస్తున్నాయి.

తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వలు లేకపోవడంతో సాగునీటిపై తీవ్ర అనిశ్చితి నెలకొంది. మరోవైపు వర్షాలు కురవకపోవడంతో విత్తుకున్న పత్తి పంట ఎండుముఖం పడుతోంది. విత్తిన మిరప విత్తనాలు తేమ లేక మొలకెత్తక నేలలోనే ఉండిపోతున్నాయి. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టిన రైతులు కళ్లముందే పంటలు నాశనం అవుతుండటాన్ని నిస్సహాయంగా చూస్తున్నారు.

“ఆకాశం వైపు కళ్లూ... నేలపై కన్నీళ్లు” అనే మాట ప్రస్తుతం హోళగుంద రైతుల వాస్తవ పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. పొలంలో పని చేసే రైతు చేతిలో మట్టి తప్ప, పంటపై ఆశ కనిపించడం లేదు. అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు ఇప్పుడు ప్రకృతి పరీక్షగా మారింది. ఇప్పటికైనా విస్తారంగా వర్షాలు కురవకపోతే ఈ ఖరీఫ్ సీజన్ పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అత్యవసరంగా స్పందించి రైతులకు భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్ ను వివరణ కోరగా వ్యవసాయ శాఖ సూచించిన శాస్త్రీయ విధానాలను పాటిస్తే నష్టాన్ని కొంత మేర తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

# వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన

# కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని

**మర్యాదపూర్వకంగా కలిసిన గోనెగండ్ల మండల మహిళా విభాగ అధ్యక్షురాలు అరుణమ్మ,,**



ఎమ్మిగనూరు పల్లె వెలుగు జులై 3 గోనెగండ్ల, జూలై 3: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని గోనెగండ్ల మండల మహిళా విభాగం అధ్యక్షురాలు అరుణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత పరిస్థితులు, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తల భాగస్వామ్యం, రానున్న రాజకీయ కార్యాచరణపై విస్తృతంగా చర్చ జరిగింది. మండలంలోని గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు ఎంతో అంకితభావంతో పనిచేస్తున్నారని, ప్రజల్లో పార్టీపై విశ్వాసం రోజురోజుకు పెరుగుతోందని అరుణమ్మ సజ్జల రామకృష్ణారెడ్డికి వివరించారు. మహిళా విభాగం ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అందరికీ సమన్వయంతో ముందుకు సాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, కార్యకర్తలే పార్టీకి నిజమైన బలమని సజ్జల రామకృష్ణారెడ్డి సూచించినట్లు అరుణమ్మ తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారని పేర్కొన్నారు. ఈ భేటీ అత్యంత సానుకూల వాతావరణంలో సాగిందని, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత బలోపేతం, మహిళా విభాగం క్రియాశీల పాత్ర, భవిష్యత్ కార్యాచరణపై నిర్మాణాత్మకంగా చర్చించినట్లు అరుణమ్మ వెల్లడించారు.

# అధిక లోడుతో వెళ్తున్న ఆటోను నిలిపివేసి డ్రైవర్‌కు కౌన్సిలింగ్

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు కర్నూలు తాలూకా సీఐ తేజమూర్తి**




పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో రహదారి భద్రతపై ప్రత్యేక చర్యలు కొనసాగు తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో పరిమితికి మించి ప్రయాణి కులతో వెళ్తున్న ఓ ఆటోను కర్నూలు తాలూకా సీఐ తేజమూర్తి గుర్తించి నిలిపివేశారు. అనంతరం ఆటోలో ఉన్న అదనపు ప్రయాణికులను సురక్షితంగా దింపించి, ఆటో డ్రైవర్‌కు , ప్రయాణికు లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ తేజమూర్తి మాట్లాడు తూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడంవల్ల రోడ్డు ప్రమాదాలముప్పు అధికంగా ఉంటుందని హెచ్చరించారు. అలాగే మోటారు వాహనాల చట్టాలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్ణీత పరిమి తికి మించి ప్రయాణికులను ఎక్కించరా దని భద్రతా ప్రమాణాలను అనుసరిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ అధిక లోడుతో వాహనాలు నడిపే డ్రైవర్లపై చట్టపర మైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని విజ్ఞప్తిచ

# ఎరువుల దుకాణాలను తనిఖీ

# చేసిన ప్రత్యేక వ్యవసాయ బృందం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 3 : నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండల పరిధిలోని ఈనెలపాడు పార్నపల్లె బండి ఆత్మకూరు గ్రామాలలోని ఎరువుల దుకాణాలను





వ్యవసాయ శాఖ స్క్వాడ్ ప్రత్యేక బృందం శుక్రవారం విస్తృత తనిఖీలను నిర్వహించారు. తంగడంచ ఫారం ఏడిఏ అరుణ లత, వ్యవసాయ అధికారి అశోక్ కుమార్ రెడ్డి, బండి ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ తో కలిసి తనిఖీలను చేపట్టారు. మండలంలోని అనుపమ ఎంటర్ప్రైజెస్ ప్రశాంతి ఫర్టిలైజర్స్ బండి ఆత్మకూరులోని ఓంకారేశ్వర ఫర్టిలైజర్స్, ఓంకారేశ్వర సంత జుటూరు, దుర్గ భవాని ఫర్టిలైజర్స్ నందు తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా అధికారుల బృందం యూరియా డిఏపీ నిల్వలను పరిశీలించారు. ఏపీ ఏ ఐఎంఎస్ యాప్ ద్వారా రైతులకు ఎరువులను పంపిణీ చేస్తున్న తీరును కూడా పరిశీలించారు. డీలర్ల వద్ద ఉన్న స్టాక్ రిజిస్టర్లు, ఫిజికల్ బ్యాలెన్స్ ( అసలు నిల్వలు ) డి బి టీ రికార్డులను తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ యజమానులు అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు సేవలు అందించాలని డీలర్లకు స్పష్టం చేశారు. ఫర్టిలైజర్ యజమానులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే రైతులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది లక్ష్మయ్య కూడా పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పంట నమోదు ప్రక్రియ.

**మండల వ్యవసాయ అధికారి బీవీసీ సుధాకర్.**



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మండలంలోని ధనాపురం గ్రామంలో ఈరోజు మండల వ్యవసాయ అధికారి బి.వి.జి. సుధాకర్ పంట నమోదు (క్రాప్ బుకింగ్) ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో వరి, పత్తి, వేరుశెనగ, మొక్కజొన్న, కంది, జొన్న, సజ్జ తదితర పంటలను సాగు చేసిన ప్రతి రైతు తమ గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. పంట నమోదు పూర్తయిన రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు అందించే సహాయ చర్యలు, పంటల ఆధారిత ఇతర ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు సరైన వివరాలతో పంట నమోదు చేయించుకోవాలని, సాగు చేసిన పంట, విస్తీర్ణం, సర్వే నంబర్ తదితర వివరాలు ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి.సతీష్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు నలిని, ఎంపీఈఓ అయ్యన్న, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవు.

రుద్రవరం. పల్లె వెలుగు : వ్యవసాయ ఎరువులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే శాఖ



పరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నయ్య, నియోజకవర్గ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు విజయ శేఖర్ , వ్యవసాయ అధికారి శశిధర్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలమూరు, రుద్రవరం గ్రామంలోని ఎరువుల దుకాణాలను స్థానిక వ్యవసాయ అధికారి సుమతి ఆధ్వర్యంలో దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు నిలువ ఉంచిన స్టాక్ ను, రికార్డులు బిల్ బుక్స్ లను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎరువుల డీలర్లు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్ , బిల్ బుక్స్ లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్ నుంచి రైతులకు ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారానే ఎరువులను పంపిణీ చేయాలని డీలర్స్ కి తెలియజేయడం జరిగిందన్నారు. మండలంలో వ్యవసాయ రైతులకు సరిపడా ఎరువులు నిల్వలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ఎరువులను డీలర్లు రైతులకు అధిక ధరలకు విక్రయించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజు, హార్టికల్చర్ అసిస్టెంట్ శ్రావణి పాల్గొన్నారు.

# ప్రజల తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యం, బ్యాంకు రుణాలు

# వేగవంతం చేయాలి : కర్నూలు కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

- అర్హులైన ప్రతి ఒక్కరికి రుణం అందించండి.
- జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలి.
- జిల్లాలో తలసరి ఆదాయాన్ని రెండు నుండి మూడు లక్షలకు పెంచడమే లక్ష్యం.




కర్నూలు బ్యూరో : కర్నూలు జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్ సేవలు అందాలని, ముఖ్యంగా బలహీన వర్గాలు, రైతులు మరియు మహిళా సంఘాలకు రుణాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్ లో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్.డి.ఎం), వివిధ బ్యాంకుల ప్రతినిధులు మరియు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రజల తలసరి ఆదాయాన్ని ప్రస్తుతమున్న రూ. 2 లక్షల నుండి రూ. 3 లక్షలకు పెంచడమే ఈ ఏడాది తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో బ్యాంకర్ల సహకారం అత్యంత కీలకమని, గడువు లోపల నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

సమీక్షలోని ముఖ్యాంశాలు:

గడువుల విధింపు: వివిధ ప్రభుత్వ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను జూలై 10 మరియు ఈ నెల ఆఖరిలోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా కెనరా బ్యాంక్, ఏపిజిబి, ఎస్.బి.ఐ బ్యాంకులు తమ పరిధిలోని దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలని పేర్కొన్నారు.

చిన్న రుణాలకు సిబిల్ (సిబిల్) నిబంధనలపై అసంతృప్తి: లైవ్‌స్టాక్ (పశుసంవర్ధక), వ్యవసాయం తదితర రంగాల్లో రూ. 1 – 2 లక్షల వంటి చిన్న రుణాలకు కూడా బ్యాంకర్లు సిబిల్ స్కోర్ నిబంధనలను కఠినంగా అమలు చేయడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న వెనుకబడిన ప్రాంతాలలో, వ్యవసాయం మరియు దాని అనుబంధ రంగాలపై ఆధారపడిన పేద ప్రజల పట్ల బ్యాంకర్లు మానవీయ కోణంలో ఆలోచించి, నిబంధనలలో అవసరమైన సడలింపులు (కూలింగ్ పీరియడ్) ఇవ్వాలని కోరారు.

కౌలు రైతులకు సంయుక్త బాధ్యత సంఘాల (జాయింట్ లయబిలిటీ గ్రూప్స్) ద్వారా రుణాలు: కౌలు రైతులకు (సిసిఆర్‌సి కార్డు దారులు) మరియు స్వయం సహాయక సంఘాల (ఎస్.హెచ్.జి) మహిళలకు రుణాల పంపిణీపై సుదీర్ఘంగా చర్చించారు. ఒకే భూమిపై భూయజమాని, కౌలు రైతు ఇద్దరికీ సాంకేతికంగా రుణాలు ఇవ్వడంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలతో కౌలు రైతుల జాయింట్ లయబిలిటీ గ్రూపులను (జె.ఎల్.జి) ఏర్పాటు చేసి, జూలై 15 లోగా అర్హులకు రుణాలు అందేలా చూడాలని డిఆర్డిఏ, మెప్మా అధికారులను ఆదేశించారు.

మత్స్యకార రంగానికి చేయూత: ఈ ఏడాది జిల్లాలో మత్స్య సంపద పెంపకానికి (137 లక్షల స్పాన్ రేరింగ్) పెద్ద ఎత్తున టార్గెట్ నిర్దేశించుకున్నామని, కావున ఫిషరీస్ కార్డ్స్ ఉన్న వారందరికీ తగినన్ని రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని, అలా చేరుకున్న బ్యాంకులకు ప్రభుత్వ నిధుల డిపాజిట్లు రూపంలో ప్రోత్సహిస్తామని కలెక్టర్ వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, మెప్మా పిడి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జెడి హేమంత్ కుమార్, ఏపీఎంఐపి పిడి సుధాకర్ మరియు వివిధ బ్యాంకుల రీజినల్ మేనేజర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# న్యాయవాదులకు తక్షణమే రక్షణ చట్టం అమలు చేయాలి

# జిల్లా కోర్టు ఎదుట నిరసన ఐ ఏ ఎల్ డిమాండ్

కర్నూల్ రాష్ట్ర వ్యాప్తంగా పిలుపుమేరకు కర్నూల్




లో భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్ ) ఆధ్వర్యంలో జిల్లా కోర్ట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమానికి భారత న్యాయవాదుల సంఘం ఐ ఏ ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిఎస్ రవికాంత్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది .దీనికి ముఖ్యఅతిథిగా కర్నూల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. చంద్రుడు, ప్రధాన కార్యదర్శి సి .మహేశ్వర్ రెడ్డి భారత న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్ .కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి బిఎస్. రవికాంత్ ప్రసాద్ హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలుపరచాలని న్యాయవాదులతో కలుపుకొని పెద్ద ఎత్తున జిల్లా కోర్టు ఎదుట నిరసన చేపట్టడం జరిగింది. ఇతర రాష్ట్రాల న్యాయవాదులకు చట్టం తీసుకొని వచ్చిన ఘనత ఆ రాష్ట్రాలకు దక్కింది మన రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందారని వారు ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చురువ తో న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని వెంటనే అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులను కలుపుకొని పెద్ద ఎత్తున కార్యచరణ ప్రకటిస్తామన్నారు. అనంతరం న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు మరియు హెల్త్ స్కీమ్, జూనియర్ న్యాయవాదులకు పదివేల రూపాయలు స్టైఫాయిడ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కర్నూల్ లో హైకోర్టు బెంచ్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడం జరుగుతుందని వారు ప్రభుత్వానికి విన్నవించారు. . ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఓంకార్, కావెళ్ల రామకృష్ణారెడ్డి, భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్ )కోశాధికారి పి. దస్తగిరి, బారాసోసియేషన్ స్పోర్ట్స్ సెక్రెటరీ ప్రభాకర్ , ఐ ఏ ఎల్ నాయకులు నరసరావు, నరసింహారాజు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు సత్తర్ల రాజేష్, వి. రవికుమార్, రాజేంద్ర,, ఈరన్న, డేవిడ్, జగదీష్, పాపారావు, తిరుపతయ్య, త్యాగరాజు, చంద్రప్ప, కుమార్, డివిసి మెంబర్ మద్దిలేటి, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

# పులిమద్ది ప్రభుత్వ పాఠశాలలో 11 మంది బోగస్ విద్యార్థుల నమోదు.

నంద్యాల బ్యూరో జులై 3 నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో




11 మంది బోగస్ విద్యార్థుల నమోదు బట్టబయలైంది.ప్రభుత్వ బడి దోపిడి గుట్టు రట్టయింది.పాఠశాలకు విద్యార్థులు రాకపోయినా వచ్చినట్టు హాజరు పట్టికలో నమోదు చేస్తూ ప్రభుత్వ నిధులు దోపిడి చేస్తున్నట్టు తెలుస్తోంది.విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ బడుల్లో ఇష్టారాజ్యంగా విద్యార్థుల హాజరు లేకపోయినా ఉన్నట్టు చూపిస్తూ కొన్ని ప్రభుత్వ బడుల్లో దోపిడి సాగిస్తున్నారు.విద్యా శాఖ అధికారులకు తెలియకుండా ఏమి జరగదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ బడుల్లో ఎన్నేళ్లుగా ఈ తతంగం జరుగుతున్నా పాపం పండి బట్టబయలైంది.రోజు హాజరు పట్టిక లో 14 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు నమోదు చేస్తున్న రోజు ఒక్క విద్యార్థి మాత్రమే వస్తున్నట్టు తెలుస్తోంది.మిగతా 13 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చినట్టు హాజరు వేసి వారికి ప్రభుత్వం ఇచ్చే కోడి గుడ్లు,మధ్యాహ్న భోజనం,పుస్తకాలు,యూనిఫాం ఎక్కడికి పోయాయో ఆ అధికారులకే తెలియాలి.ఒక్క గ్రామం లోనే ఇంత దోపిడి జరుగుతుంటే నంద్యాల నియోజకవర్గంలోని ఉన్న బడుల్లో హాజరు పట్టి లో ఉన్న విధంగా విద్యార్థులు వస్తున్నారో,బోగస్ లెక్కలు చూపిస్తూ దోచుకుంటున్నారో తెలియాల్సి ఉంది.పాఠశాలలో పని చేసి ఉపాధ్యులతో పాటు,విద్యా శాఖ అధికారులపై కూడా శాఖా పరమైన చర్యలు తీసుకుంటే కానీ మరో సారి ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవు.వివరాల్లోకి వెళితే నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది.ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు చేరే విధంగా వారికి మధ్యాహ్న భోజనం,కోడి గుడ్లు,పుస్తకాలు,యూనిఫాం తదితర సౌకర్యాలు కల్పిస్తుంది.గతంలో ఆ పాఠశాలలో విద్యార్థులు బాగానే ఉన్నట్టు తెలుస్తోంది.పాఠశాలలకు ప్రభుత్వం పలు పథకాలు ఇస్తున్నా విద్యా శాఖ అధికారులు పర్యవేక్షణ కరువు కావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గు ముఖం పడుతుంది.ప్రవేటు పాఠశాలల్లో కేవలం 8 వేలు జీతం తీసుకుంటున్న ఉపాధ్యులు తమ,తమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగటానికి ఇంటింటికి తిరిగి విద్యార్థుల సంఖ్య పెంచుతున్నారు.ప్రభుత్వ బడుల్లో మాత్రం లక్షల జీతాలు తీసుకుంటూ విద్యార్థుల సంఖ్య పెంచడంలో నిర్లక్షం వహిస్తున్నారు.ప్రస్తుతం ఉండే విద్యార్థులు సైతం ప్రభుత్వ బడులకు రామ్,రామ్ చెపుతూ ప్రవేటు పాఠశాలల్లో చేరుతున్నారు.ఈ నేపథ్యంలోనే పులిమద్ది ప్రభుత్వ పాఠశాలలో మీడియా మిత్రులు పర్యటనలో ఆసక్తికరమైన దోపిడి బట్టబయలు చేశారు.పాఠశాలలో 14 మంది విద్యార్థులు ఉన్నట్టు హాజరు పార్టీలో ఉన్నా అక్కడ ఉండేది ఒక్క విద్యార్థి ఉండడం సంచలనంగా మారింది.ప్రచార మాధ్యమాల్లో వార్త రావడంతో విద్యాశాఖ అధికారి బ్రహ్మం నాయక్ బడిని సందర్శించారు.అధికారులు వస్తున్నారని మరో విద్యార్థులు ప్రత్యక్షం కావడం విశేషం.ప్రస్తుతం హాజరు పార్టీలో 14 మంది విద్యార్థులు హాజరైనట్టు ఆయన తనకి లో వెలుగుచూసింది.ఎన్నాళ్ళ నుంచి ఈ తతంగం జరుగుతుందో అర్థం కానీ పరిస్థితి.విద్యార్థులకు ఇచ్చే మద్యహనబోజనం,కోడి గుడ్లు,యూనిఫాం,పుస్తకాలు సైతం గుట్టుగా ఇన్నాళ్లు దోపిడి చేస్తున్నట్టు తెలుస్తోంది.ఉన్నత అధికారులు లైట్ గా తీసుకోకుండా దోపిడి నీ లోతుగా దర్యాప్తు చేసి,పాఠశాలలు తనికీలు చేయని విద్యా శాఖ అధికారులపై సైతం శాఖాపరమైన చర్యలు తీసుకుంటే కానీ సమస్య పరిష్కారం కాదు.మరో విశేషం ఏమంటే ఈ రోజు పులిమద్ది కి వెళ్ళినా పాత్రికేయులు కొందరిని విద్యా శాఖ అధికారి కాసేపు మాట్లాడి బయటకు వెళ్లి పొమ్మని చెప్పడం విశేషం.నంద్యాల నియోజకవర్గంలో ఇలాంటి దోపిడి ఎన్ని ప్రభుత్వ బడుల్లో జరుగుతుందో అర్థం కానీ పరిస్థితి.ఉన్నతాధికారులు ఎప్పుడైనా ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రమే తనికీలు చేయకుండా విధిగా తనికీలు చేస్తే ఇలాంటి సంఘటనలు జరగవని మేధావులు పేర్కొంటున్నారు.

# ఆహార భద్రత పథకాలపై రాష్ట్ర కమిషన్ తనిఖీలు.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జాతీయ ఆహార భద్రతా చట్టం--2013 అమలు తీరును పరిశీలించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చి. విజయ ప్రతాప్ రెడ్డి శుక్రవారం నంద్యాల జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. పగిడ్యాల, నందికొట్కూరు, మిడుతూరు, గడివేముల, నంద్యాల మండలాల్లో రేషన్ దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకుల, ప్రభుత్వ పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం, హాస్టళ్లను తనిఖీ చేసి అమలుపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, హాస్టళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన ఆహార మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని వార్డెన్లకు ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా పౌర సరఫరాల అధికారి జ్యోతి రవిబాబు, సివిల్ సప్లయిస్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, విద్యాశాఖ, ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి సోషల్ మీడియా తోడ్పాటు అవసరం.






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ పథకాల ప్రచారంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నంద్యాల జిల్లాలోని అహోబిలం, మహానంది, యాగంటి, శ్రీశైలం, నవనందులు వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు ఉద్యానవనం, సమీకృత వ్యవసాయం, పీఎం సూర్యఘర్ పథకం, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, నల్లమల తేనె, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు, జిల్లాలోని పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించి పరిశుభ్రతను ప్రతి ఒక్కరి జీవనశైలిగా మార్చేలా ప్రచారం చేయాలని కోరారు. నంద్యాల జిల్లా అభివృద్ధి, ప్రత్యేకతలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందేలా సోషల్ మీడియా వేదికలను సమర్థంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు

# కోచింగ్ సంస్థలు తప్పనిసరిగా సి.ఐ.ఆర్.యం.ఎస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి





కర్నూలు బ్యూరో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో కోచింగ్ సంస్థల నియంత్రణ మరియు పర్యవేక్షణ కోసం ం౯ ా ెా ం ది ం చి న సి.ఐ.ఆర్.యం.ఎస్ (కోచింగ్ ఇన్స్టిట్యూటషన్స్ రెగ్యులేషన్ అండ్ మేనేజ్మెంట్ సిస్టమ్) వెబ్ పోర్టల్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని అర్హత కలిగిన కోచింగ్, ట్యూషన్ సంస్థలు తప్పనిసరిగా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఒక ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ (డి.ఎల్.యం.సి) ఆధ్వర్యంలో కోచింగ్ సంస్థల నమోదుతో పాటు పర్యవేక్షణ ప్రక్రియ చేపట్టబడుతుందని పేర్కొన్నారు. 50 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న కోచింగ్, ట్యూషన్, విద్యా మార్గదర్శకత్వం, క్రీడలు, నృత్యం, సంగీతం, నాటకం, కళలు మరియు ఇతర సృజనాత్మక శిక్షణా కేంద్రాలు తప్పనిసరిగా సి.ఐ.ఆర్.యం.ఎస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న కోచింగ్ సెంటర్ల నమోదు చివరి తేదీ: 30 సెప్టెంబర్ 2026 అని కలెక్టర్ తెలిపారు. పోర్టల్ ద్వారా జారీ చేసే నమోదు ధ్రువీకరణ పత్రం మూడు సంవత్సరాల పాటు చెల్లుబాటు అవుతుందని, దరఖాస్తులో పేర్కొన్న ప్రాంగణంలో మాత్రమే సంస్థ నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కోచింగ్ సంస్థల్లో తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని కోచింగ్ సంస్థల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా సి.ఐ.ఆర్.యం.ఎస్ వెబ్ పోర్టల్‌లో నమోదు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# సంపాదకీయం

## పార్లమెంట్‌లో వ్యూహాత్మకంగా కార్యాచరణ

2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదింప జేసుకోవాలన్న కృతనిశ్చయంతో ఉంది కేంద్రం. రెండింటికి పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా?ప్రభుత్వం వ్యూహాత్మకంగా కార్యాచరణను సిద్ధం చేస్తోంది. వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును పునఃప్రవేశపెట్టేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తోంది. మహిళా కోటా విషయానికొస్తే.. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం.. పునర్విభజన తర్వాతే 33 శాతం కోటా అమల్లోకి రావాలి. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో కూడా వన్–థర్డ్ కోటాను మహిళలకు కేటాయించనున్నారు. దీంతో అదే దామాషాలో ఆయా వర్గాల మహిళలకూ లబ్ధి చేకూరుతున్నట్టే. 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లుతో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభిస్తాయి. నియోజకవర్గాల పునర్విభజన కాకపోవడంతో ఈ చట్టం అమల్లోకి రాలేదు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందుగానే ఈ చట్టాన్ని అమలు చేయాలంటే మరో రాజ్యాంగ సవరణ తప్పనిసరి. చట్టం ఏర్పడిన తర్వాత వచ్చే మొదటి జనాభా లెక్కల సేకరణ అనంతరం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళలకు రిజర్వేషన్‌ను అమలుచేయాలని చట్టం నిర్దేశిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు అతీతంగా ఇది అమలు చేయాలంటే ఈ చట్టంలోని సెక్షన్ 5ని ప్రభుత్వం సవరించాల్సి ఉంటుంది. ఇది పార్లమెంట్ ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది ఆమోదంతోనే చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని? రాజ్యాంగంలోని 368(2) అధికరణ నిర్దేశిస్తోంది.నియోజకవర్గాల పునర్విభజన జరగాలంటే పలు రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. అలా రాజ్యాంగ సవరణ కోసం ప్రవేశపెట్టే బిల్లులకు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం. సభలో సభ్యుల హాజరు సగానికిపైగా ఉండాలి. హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలుపాలి. అప్పుడే ఆ బిల్లు ఆమోదం పొందుతుంది. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 540 మంది ఎంపీలు సభకు హాజరైతే.. వారిలో 360 మంది తప్పనిసరిగా బిల్లుకు మద్దతు తెలపాలి. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు రాజ్యసభ ముందుకు వస్తుంది. రాజ్యసభలో ప్రస్తుతం ఉన్న 244 మంది సభ్యులు సభకు హాజరైతే.. 163 మంది బిల్లుకు మద్దతు తెలపాలి. అప్పుడే ఆ బిల్లు రాష్ట్రపతి ఆమోదం అనంతరం చట్టంగా మారుతుంది. కానీ అధికార ఎన్డీయే కూటమికి ఉభయ సభల్లో ఇప్పుడు అంత బలం లేదు. అందుకే ఆ బలం కూడగట్టానికి రకరకాల రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.ఏప్రిల్‌లో మహిళా రిజర్వేషన్ ప్యాకేజీలో భాగంగా వచ్చిన డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో 54 ఓట్ల తేడాతో ఆమోదం పొందలేదు. అయితే తాజా రాజకీయ పరిణామాల తరుణంలో అదే బిల్లు మళ్లీ ప్రవేశపెడితే ఆమోదం పొందే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం లోక్‌సభలో బలాబలాలు చూస్తే.. మొత్తం సభ్యుల సంఖ్య 543గా ఉంది. మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. అంటే ప్రస్తుత సభ్యుల సంఖ్య 540 మాత్రమే. మూడింట రెండొంతుల మెజార్టీ అంటే 360 మంది మద్దతు కావాలి. ఎన్డీఏకు ప్రస్తుతం 318 మంది సభ్యులున్నారు. ప్రతిపక్షానికి 184 మంది సభ్యుల బలం ఉంది. ఇతరులు 38 మంది ఉన్నారు. బడ్జెట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లుల ఓటింగ్ సమయంలో 528 మంది సభ్యులు హాజరయ్యారు. అప్పుడు బిల్లు ఆమోదానికి 352 ఓట్లు అవసరమయ్యాయి. ఎన్డీయే కు అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే రావడంతో 54 ఓట్ల తేడాతో బిల్లు ఆగిపోయింది. కానీ అప్పటికి, ఇప్పటికి పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతం టీఎంసీ రెబల్ ఎంపీలు 20 మంది, ఉద్ధవ్ థాక్రే శివసేన ఎంపీలు ఆరుగురు కలిపి ఎన్డీఏ ఖాతాలోకి 26 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా. అప్పుడు లోక్‌సభలో ఎన్డీఏ బలం 318 నుంచి 344కు పెరుగుతుంది.స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కాంగ్రెస్‌తో విభేదాల తరుణంలో ఇండి కూటమికి దూరమైంది. ఇప్పటికే బీజేపీ డీఎంకేను ఎన్డీఏలోకి ఆహ్వానించిందనే ప్రచారం జరుగుతోంది. డీఎంకే ఎన్డీఏలో చేరకపోయినా.. లోక్‌సభలో ఎన్డీఏకు జై కొడితే.. ఆ పార్టీకి చెందిన 22 మంది ఎంపీల బలం కూడా జత కలుస్తుంది. అప్పుడు ఎన్డీఏ బలం ఏకంగా 344 నుంచి 366కు పెరుగుతుంది. ఇప్పటికే ఈ మేరకు స్టాలిన్ నుంచి హామీ ఉందని కూడా బీజేపీ వ్యూహాత్మకంగా ప్రచారం చేసుకుంటోంది. సరే ఇక్కడివరకు లోక్‌సభలో పరిస్థితి ఓకే. కానీ కీలకమైన రాజ్యసభ సంగతేంటి అనే ప్రశ్న వస్తుంది. రాజ్యసభలో రెండొంతుల మెజారిటీకి 164 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం ఎన్డీఏ దగ్గర 150 మంది సభ్యులు ఉన్నారు. ఇక్కడ కూడా డీఎంకేకు చెందిన 8 మంది సభ్యుల మద్దతు లభిస్తే సంఖ్య 158కు చేరుతుంది. అప్పుడు మరో ఆరుగురు సభ్యుల మద్దతు అవసరం అవుతుంది. అయితే వచ్చే సెషన్‌లో మహిళా, డీలిమిటేషన్ బిల్లులు వచ్చే సమయానికి.. ఏదో రకంగా ఈ బలం సమకూర్చుకోవచ్చనేది బీజేపీ ఆలోచనగా ఉంది. పైగా ఒక్కసారి బిల్లులు లోక్‌సభ ఆమోదం పొందితే.. రాజ్యసభలో అనుకోని విధంగా మద్దతు లభిస్తుందనే లెక్కలు కూడా లేకపోలేదు.ఇప్పటికే టీఎంసీ, శివసేన యూబీటీ నుంచి ఎంపీల్ని ఆకర్షించి మద్దతు కూడగట్టడంలో సఫలమైన బీజేపీ..ఇప్పుడు శరద్ పవార్ ఎన్సీపీ, నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్, పంజాబ్‌లో ఆప్ మీద కూడా కన్నేసినట్టు చెబుతున్నారు. త్వరలో ఈ ఆపరేషన్లు కూడా కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని చిన్న పార్టీలతో చర్చలు పూర్తయ్యాయని, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలయ్యాక విపక్షానికి మరిన్ని షాకులిచ్చే ఉద్దేశంతో బీజేపీ ఉందనే చర్చ జరుగుతోంది. ఏదే?నా ప్రస్తుతం హస్తిన వేదికగా రాజకీయ వ్యూహాలు జోరుగా సాగుతున్నాయి. నయానో భయానో ఎంపీల బలం పెంచుకోవటానికి బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. కుదిరితే రాష్ట్ర స్థాయి నేతలు, పార్టీ సీఎంలు, అవసరమైతే అగ్రనేతలే నేరుగా రంగంలోకి దిగి పని పూర్తిచేయాలనే కార్యాచరణ సిద్ధమైంది. అన్నింటికీ మించి డీలిమిటేషన్ బిల్లును తిప్పికొట్టామనే ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతున్న ప్రతిపక్ష కూటమిని నైతికంగా చావుదెబ్బ కొట్టాలనేది కాషాయ పార్టీ లక్ష్యంగా ఉంది. అందుకే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాగానే రాజకీయ సమీకరణాలు మార్చే పని మొదలుపెట్టారనే అభిప్రాయాలు వస్తున్నాయి.లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కేంద్రం మరో ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోంది. లోక్ సభ నియోజకవర్గాలను ప్రస్తుతం ఉన్న 543 నుంచి 824కి పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఇప్పటికే సూచన చేసింది. . అంటే ప్రతీ రాష్ట్రంలో ఉన్న సీట్లలో మరో యాభై శాతం పెంచే బదులుగా?మరో కొత్త ఫార్ములాతో ఈ మండలి ప్రతిపాదనలు ఉండడం ఆసక్తిని పెంచుతోంది. మూడో వంతు పార్లమెంట్ సీట్లను మాత్రమే పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సిఫార్సు చేసినట్లుగా తెలుస్తోంది. అంటే 170 పార్లమెంట్ నియోజకవర్గాలలోనే పునర్ విభజన ఉండనుంది. 59 పార్లమెంట్ నియోజకవర్గాలను రెండుగా విభజించాలని? మరో 111 సీట్లను మూడుగా చేయాలని మండలి సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. మరి ఇప్పుడు వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్ ముందుకొచ్చే బిల్లు ఇలాగే ఉంటుందా.. మరేదైనా మార్పు చేస్తారా అనేది చూడాల్సి ఉంది.మోడీ ప్రధాని అయ్యాక పార్లమెంట్‌లో ఏ బిల్లు ఆమోదం విషయంలోనూ ఎన్డీఏ సర్కారు ఇబ్బంది పడలేదు. అందుకే రెండు నెలల క్రితం మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు వచ్చినప్పుడు కూడా సర్కారు పకడ్బందీ ప్లాన్‌తోనే వచ్చుంటుందనే చర్చ జరిగింది. కానీ అధికార పక్షానికి షాకిస్తూ ఒక్కతాటిపైకి వచ్చిన విపక్షం.. ఆ రెండు బిల్లుల్ని తిప్పికొట్టింది. దీంతో ఎక్కడైనా అతివిశ్వాసానికి పోయామా అని ఎన్డీఏలో అంతర్గత చర్చ జరిగింది. ఆ సందర్భంగా పార్లమెంట్‌లో అనుసరించిన వ్యూహం.. విపక్షాల్ని ఎందుకు ఒప్పించలేకపోయామనే ప్రశ్నలకు సమాధానాలపై సమీక్ష జరిగింది. అప్పుడు జరిగిన పొరపాట్లు మరోసారి జరగకుండా.. అన్ని జాగ్రత్తలు తీసుకుని.. ఇంకా చెప్పాలంటే ప్లాన్ బీ కూడా రెడీగా పెట్టుకుని మరీ ఈసారి కేంద్రం రంగంలోకి దిగుతోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఇక్కడ డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల మద్దతే అసలు ఉద్దేశం కాదు. ప్రధానంగా 2/3 వ వంతు మెజార్టీ కూడగట్టడమే అసలు లక్ష్యం. అప్పుడే ఈ బిల్లులతో పాటు భవిష్యత్తులో యూనిఫామ్ సివిల్ కోడ్ అయినా.. వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లులైనా సాఫీగా ఆమోదం పొందుతాయనేది బీజేపీ దూరాలోచనగా ఉంది. అందుకే ఈ లక్ష్యాన్ని తేలిగ్గా తీసుకోవటానికి కాషాయ పార్టీ సిద్ధంగా లేదు.

# రిటైర్డ్ ఉద్యోగుల జీవన భద్రతకు ముప్పు!



ప్రభుత్వ ఉద్యోగి తన జీవితకాల కష్టార్జితాన్ని, రెక్కల కష్టాన్ని నమ్ముకుని, భవిష్యత్తు అవసరాల కోసం దాచుకునే ప్రధాన వనరు -- రిటైర్మెంట్ బెనిఫిట్స్. పిల్లల చదువులు, కుమార్తెల పెండ్లిళ్లు, ఇల్లు కట్టుకోవడం లేదా అత్యవసర వైద్య ఖర్చుల కోసం వారు ఈ సొమ్మునే ఆశ్రయిస్తారు. అయితే, రాష్ట్రంలో దశాబ్దాల పాటు సేవలు అందించి, రిటైరైన ఉద్యోగులు తమ సొంత సొమ్మును కూడా సకాలంలో తీసుకోలేక తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు మూడేండ్లు కావస్తున్నా తమకు పూర్తి మొత్తంలో రావాల్సిన బకాయిలు అందక వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంతంగా జీవితాన్ని గడుపుదామనుకునే వారికి ప్రభుత్వ ఉదాసీనత వల్ల తీవ్ర అన్యాయం జరుగుతున్నది. ప్రభుత్వం నుంచి రావలసిన ప్రధాన బెనిఫిట్లు నిలిచిపోవడంతో వృద్ధాప్యంలోనూ ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితులు దాపురించాయి. 2024 ఏప్రిల్ నుంచి రిటైరైన సుమారు 10 వేల మందికి పైగా ఉద్యోగుల పెన్షన్ ప్రయోజనాలు పూర్తిగా నిలిచిపోయాయి. తీవ్ర ఒత్తిడి, కోర్టు కేసుల నేపథ్యంలో కొంతమంది ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్లలో కేవలం 30-50 శాతం మాత్రమే చెల్లించి, మిగిలిన మొత్తాన్ని సర్కార్ పెండింగ్‌లో పెట్టింది. అరకొర చెల్లింపుల వల్ల తమ అవసరాలు ఏమాత్రం తీరక రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్స్ మాత్రమే కాకుండా, గతంలో రావాల్సిన ఇతర ఆర్థిక ప్రయోజనాలు కూడా వారికి నిలిచిపోయాయి. తాము ప్రతి నెలా జీతం నుంచి పొదుపు చేసుకున్న జీపీఎఫ్ నిధులను సైతం నిలిపివేయడం శోచనీయమని ఆవేదన చెందుతున్నారు. టీఎస్‌జీఎల్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్, తెలంగాణ స్టేట్ ఇన్సూరెన్స్, జీఐఎస్ బకాయిలు కూడా సకాలంలో చెల్లించడం లేదు. గ్రాట్యుటీ క్రెడిట్ చేయకుండా కేవలం కమ్యూటేషన్ మాత్రమే వేయడంపై తీవ్ర చర్చ జరుగుతున్నది. వాస్తవానికి కమ్యూటేషన్ ఇచ్చిన మరుసటి నెల నుంచే పెన్షన్‌లో దాదాపు 40 శాతం వరకు రికవరీ జరుగుతుంది. గ్రాట్యుటీ రాకుండా పెన్షన్ మొత్తం తగ్గిపోవడంతో పెద్ద ఆర్థిక భారంగా మిగులుతున్నది. ఎర్న్‌డ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీవితాంతం దాచుకున్న 300 రోజుల సంపాదిత సెలవుల నగదు బిల్లులు కూడా చాలామందివి ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. పాత పీఆర్సీ బకాయిలు ఇప్పటికీ ఎంతోమందికి పూర్తి స్థాయిలో అందలేదు. గత రెండు నెలలుగా రిటైర్డ్ ఉద్యోగుల జీతాలు/పెన్షన్ల నుంచి ఈహెచ్‌ఎస్ పేరిట రికవరీ చేస్తున్నా, క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించే హెల్త్ కార్డ్స్ ఇప్పటికీ అందలేదు. దీనివల్ల వృద్ధాప్యంలో అత్యవసర వైద్య ఖర్చుల కోసం ఇతరులపై ఆధారపడాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఆరు నెలల్లో అమలు చేస్తామన్న పీఆర్సీ, నెలలు గడుస్తున్నా కనీసం నివేదిక కూడా బయటకు రాకపోవడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. 2024 జనవరి నుంచి రావలసిన సుమారు 6 డీఏ బకాయిల మంజూరులో తీవ్ర ఆలస్యమవుతున్నది. విశ్రాంత ఉద్యోగుల జీవితాలు రోడ్డున పడకుండా ఉండాలంటే..ఉద్యోగ విరమణ చేసిన నెలలోపే వారికి రావాల్సిన అన్ని ప్రయోజనాలను అందించాలి. ఇది వారి ప్రాథమిక హక్కుగా పరిగణించాలి. రిటైర్డ్ ఉద్యోగులు వృద్ధాప్యంలో గౌరవంగా, ఆర్థిక భద్రతతో జీవించేలా చూడటం ప్రభుత్వ కనీస బాధ్యత. వారి చట్టబద్ధమైన హక్కులను కాపాడటానికి, జీవితాంతం దాచుకున్న సొమ్మును సకాలంలో అందించడానికి వెంటనే స్పందించి, తగిన తక్షణ చర్యలు చేపట్టాలి. అత్యవసర అవసరాల కోసం తాత్కాలిక రుణాలు, జీపీఎఫ్ పాక్షిక ఉపసంహరణలకు తక్షణ అనుమతులు మంజూరు చేయాలి. జీపీఎఫ్ ఫైనల్ క్లోజర్ మొత్తంతో పాటు పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ, కమ్యూటేషన్, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ నిధులను యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రిటైర్డ్ ఉద్యోగుల జీవన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి.

# కొత్త అవతారంలో నరేగా!



ఎవరెన్ని అభ్యంతరాలు చెప్పినా నిరుడు డిసెంబర్‌లో పార్లమెంటు ఆమోదించిన వీబీ-- జీ రాం జీ చట్టం బుధవారం నుంచి అమల్లోకొచ్చింది. ఇది రద్దయిన ఉపాధి హామీ పథకం (నరేగా)కు సరికొత్త అవతారం. గత పథకంలోని 'హక్కుల ప్రాతిపదిక'ను మార్చొద్దనీ, రాష్ట్రాలపై ఆర్థిక భారం పడే విధానానికి స్వస్తిచెప్పి, గతంలో మాదిరే కేంద్రమే భరించాలని పౌరసమాజ కార్యకర్తలతోపాటు కొన్ని రాష్ట్రాలు కూడా కోరాయి. అయితే నరేగా కన్నా ఇదెన్నో రెట్లు మేలని కేంద్రం చెబుతోంది. గత పథకంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి వంద రోజుల పని దినాలకు అనుమతించగా, తాము మరో 25 రోజులు పెంచామని... కూలీల వేతనాలు పెరిగాయని, వారానికోసారి చెల్లింపులు, ఇతర సంస్కరణలు తీసుకురావటంతో అవినీతికి ఆస్కారం ఉండబోదని కేంద్రం చెబుతోంది. పాత పథకంలో ప్రతి 15 రోజులకొకసారి చెల్లించాలన్న నిబంధన ఉన్నా, బ్యాంకింగ్ సదుపాయాలు అంతంతమాత్రమే కావటంవల్ల నిరుపేద కుటుంబాలు నెలల తరబడి వేచిచూడాల్సివచ్చేది. ఈలోగా రోజులు గడవటానికి అధిక వడ్డీ రేట్లకు అప్పులు చేసే వారు. ఇప్పుడు వారానికొకసారి వేతనాలిస్తామంటున్నా ఈ లోటుపాట్లు సరిదిద్దకపోతే నిరుపయోగమే. గ్రామీణ కూలీలకు మరో 25 రోజులు పనిదొరకటం, అందువల్ల అదనపు ఆదాయం రావటం హర్షించదగ్గది. అయితే నరేగాకింద గ్రామాల్లో సంబంధిత పక్షాల సమావేశాల నిర్ణయాల ఆధారంగా చేయించాల్సిన పనులు ఖరారయ్యేవి. తాజా చట్టం ప్రకారం అలాంటి పనులేమిటో కేంద్రం 'వాస్తవ ప్రమాణాల' ఆధారంగా నిర్ణయిస్తుంది. దాని కయ్యే వ్యయాన్ని కూడా అంచనా వేస్తుంది. అందులో 40 శాతాన్ని రాష్ట్రం భరిస్తే, మిగి లిన 60 శాతం నిధులు కేంద్రంనుంచి వస్తాయి. చేయించాల్సిన పనులు, వాటి అంచనా వ్యయం ఆధారంగా వివిధ రాష్ట్రాలకు వేర్వేరు కేటాయింపులుంటాయి. కేంద్రం నిర్దేశించిన పనుల కన్నా అధికంగా చేయించదల్చుకుంటే అందుకయ్యే మొత్తం వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. పాత పథకంలో నిధుల దుర్వినియోగం మాట వాస్తవం. కనబడని మనుషుల పేర్లతో కైంకర్యం చేసిన ఉదంతాలు అనేకం బయటపడ్డాయి. అందుకే హిందీ రాష్ట్రాల్లో 'పిశాచ లబ్ధిదారుల'న్న పేరు కూడా వచ్చింది. అయితే ఇప్పుడున్న సాంకేతికత అప్పుడు లేదు. మొత్తం కాగితాలపైనే వ్యవహారాలన్నీ నడిచేవి. ఆన్‌లైన్ వ్యవస్థలు, డిజిటల్ చెల్లింపులు వచ్చాక ఆ బెడద తగ్గింది. 'నరేగా'ను అవినీతి పేరుతో కొట్టిపారేయటం సరికాదు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 2006లో ప్రారంభమైన ఈ పథకం తొలి దశాబ్దకాలంలో దాదాపు కోటిన్నరమంది ప్రజలను దారిద్ర్యంనుంచి విముక్తుల్ని చేసింది. ఇది చిన్న విషయమేం కాదు. అలాగే సగటున మహిళలకు 50 శాతం పనులు దక్కేవి. ఈ పథకంవల్ల సాగు పనులకు కూలీల కొరత వస్తున్నదన్న ఫిర్యాదులు ఉండేవి. కానీ జాతీయ గణాంకాలు మాత్రం సాగు పనులు ముమ్మరంగా ఉండే సమయంలో 'నరేగా'కు డిమాండ్ తక్కువేనని చెబుతున్నాయి. కూలీలకు బేరమాడే శక్తి పెరిగిందనీ, వారి కూలీ రేట్లు పెరిగాయనీ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ంకొత్త పథకంలో రాష్ట్రాలు కూడా వ్యయం భరించాల్సిరావటం ఒకరకంగా విషాదం. 'నిధులు నిండుకుంటే హక్కులు నీరసిస్తాయ'ని ఆర్థికవేత్తలు చెబుతుంటారు. ఈ పథ కానికి కేటాయింపుల కోసం రాష్ట్రాలు ముందుగా సంక్షేమ పథకాలకే... మహిళా సంక్షేమానికే కోత పెడతాయి. గతంలో నిధులు లేక కాదు... అమలుపై ఆసక్తి కొరవడి అత్యధిక పేదరికం ఉండే బిహార్, ఉత్తరప్రదేశ్‌లు అతి తక్కువ నిధులు వినియోగించాయని గణాంకాలు సూచిస్తున్నాయి. ఇప్పుడు నిధుల లేమితో చాలా రాష్ట్రాలు ఆ తోవన పోయినా ఆశ్చర్యం లేదు. మొన్న ఏప్రిల్ సమావేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, బిహార్‌లతోపాటు జార్ఖండ్, ఉత్తరాఖండ్, తెలంగాణలు నిధుల భారం మోపటాన్ని వ్యతి రేకించాయి. తాజాగా తమిళనాడు సీఎం విజయ్ కూడా గొంతుకలిపారు. ఆశ్చర్యకరంగా ఆంధ్రప్రదేశ్ మాత్రం నిమ్మకునీరెత్తినట్టు ఉండిపోయింది. ఎటూ సంక్షేమాన్ని అరకొరగా చేస్తున్నాం... దాన్ని మరింత కత్తిరిస్తే సరిపోతుందని సీఎం చంద్రబాబు నాయుడు అనుకుంటున్నట్టున్నారు. ఏదేమైనా ఆచరణలో వచ్చే సమస్యల్ని అధ్యయనం చేశాకైనా వీబీ-- జీ రాం జీ ని మెరుగుపరచటం మేలు.

# సొంత రాష్ట్రంలోనే పట్టు కోల్పయిన సంతోష్

**బెంగళూరు :** భారతీయ జనతా పార్టీ లో అత్యంత శక్తివంతమైన జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి నుండి బీఎల్ సంతోష్ ను తప్పించి, తిరిగి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కు పంపాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్ణయించారని ప్రచారం జరుగుతోంది. సుదీర్ఘ కాలంగా పార్టీ అంతర్గత చక్రం తిప్పిన సంతోష్, ఇటీవల కాలంలో మోదీ-షాల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారనే టాక్ బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా కీలక ఎన్నికల్లో ఆయన అనుసరించిన ఏకపక్ష వ్యూహాలు పార్టీకి భారీ నష్టాన్ని చేకూర్చడమే కాకుండా, శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీయడం వల్లే ఈ నిర్ణయమని అంటున్నారు.బీఎల్ సంతోష్‌పై మోదీ-షాలకు నమ్మకం సడలడానికి ప్రధాన కారణం ఆయన సొంత రాష్ట్రమైన కర్ణాటక. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బలమైన మాస్ లీడర్, లింగాయత్ దిగ్గజం బీఎస్ యడియూరప్ప ప్రభావాన్ని తగ్గించేందుకు సంతోష్ గట్టిగా ప్రయత్నించడం. టికెట్ల కేటాయింపులో యడియూరప్ప వర్గాన్ని పక్కనబెట్టి, కేవలం సిద్ధాంతాల ప్రాతిపదికన కొత్తవారికి సీట్లు ఇవ్వాలనే సంతోష్ పట్టుదల కారణంగా పార్టీ అక్కడ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. క్షేత్రస్థాయి రియాలిటీని కాదని, కేవలం తన ఇగో కోసమే సంతోష్ తీసుకున్న నిర్ణయాలు దక్షిణ భారతదేశంలో బీజేపీ ఏకైక కోటను కూల్చేశాయని, దీనిని మోదీ-షాలు ఇప్పటికీ క్షమించలేకపోతున్నారని అంటున్నారు.బీఎల్ సంతోష్ సంస్థాగత కార్యదర్శిగా ఉన్నప్పటికీ, మాతృ సంస్థ అయిన ఆరెస్సెస్‌కు, బీజేపీ అధినాయకత్వానికి మధ్య సరైన సఖ్యత ఏర్పాటు చేయలేకపోయారన్న విమర్శలు కూడా ఉన్నాయి. జాతీయ స్థాయిలో ఆరెస్సెస్ గ్రౌండ్ క్యాడర్‌తో సమన్వయం చేసుకోవడంలో ఆయన విఫలమయ్యారని, పైగా పార్టీలో తన పట్టును నిలుపుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని నివేదికలు చెబుతున్నాయి. దీనివల్ల గత సార్వత్రిక ఎన్నికల్లో చాలా చోట్ల ఆరెస్సెస్ కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయలేదు, ఫలితంగా బీజేపీ సొంతంగా మ్యాజిక్ ఫిగర్ సాధించలేక కూటమిపై ఆధారపడాల్సి వచ్చింది. ఈ తీవ్రమైన సమన్వయ లోపం నేరుగా ప్రధాని మోదీ గ్రాఫ్‌పైనే ప్రభావం చూపడంతో, ఆరెస్సెస్ అగ్రనాయకత్వం కూడా సంతోష్‌ను మార్చడమే శ్రేయస్కరమని ఢిల్లీ పెద్దలకు సూచించినట్లు టాక్.బీఎల్ సంతోష్ వర్కింగ్ స్టైల్ చాలా కఠినంగా, రాష్ట్ర స్థాయి నాయకులను అణచివేసేలా ఉంటుందనే ఫిర్యాదులు మోదీ, అమిత్ షాల వద్దకు వెల్లువలా చేరాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌ల నియామకాల్లో కానీ, స్థానిక వ్యూహాల అమలులో కానీ ఆయన స్థానిక నేతలకు కనీస ప్రాధాన్యత ఇవ్వలేదనే వాదన ఉంది. అధికారం కేంద్రీకృతం కావడం వల్ల కొత్త నాయకత్వం ఎదగకుండా పోతోందని అధిష్ఠానం గుర్తించింది. ప్రధాని మోదీ 3.0 హయాంలో పార్టీని మరింత ఆధునికంగా, అందరినీ కలుపుపోయేలా తీర్చిదిద్దే క్రమంలో.. వివాదాలకు కేంద్రబిందువుగా మారిన బీఎల్ సంతోష్ శకానికి స్వస్తి పలకడమే ఉత్తమమని మోదీ-షాల ద్వయం భావించి, ఆయనను సున్నితంగా సంఘ్‌కు పంపేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసిందని అంటున్నారు.




# 'లెనిన్' ట్రైలర్‌పై సినీ తారల ప్రశంసలు..

అక్కినేని యువ హీరో అఖిల్ అక్కినేని నటిస్తున్న తాజా చిత్రం లెనిన్ విడుదలకు సిద్ధమవుతోంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. చాలా కాలంగా భారీ విజయం కోసం ఎదురుచూస్తున్న అఖిల్‌కు ఈ సినిమా కీలకంగా మారింది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ చూసిన తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబు సోషల్ మీడియా వేదికగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు ట్రైలర్ చాలా ఎంజాయ్ చేశాను. అఖిల్ తన పాత్రలో హృదయాన్ని, ఆవేశాన్ని అద్భుతంగా చూపించాడు. ప్రతి ఫ్రేమ్‌లో అతని నటన ఆకట్టుకుంది. జూలై 10న విడుదల కానున్న ఈ సినిమాతో మొత్తం చిత్ర బృందానికి భారీ విజయం దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అంటూ ఆయన పోస్టు చేశారు. మహేష్ బాబు చేసిన ఈ పోస్టుకు స్పందించిన అఖిల్.. "అన్నా.. మీ పోస్టు మా ముఖాల్లో పెద్ద చిరునవ్వు తీసుకొచ్చింది. మీకు ఎంత థ్యాంక్స్ చెప్పినా తక్కువే" అంటూ కృతజ్ఞతలు తెలిపాడు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా ట్రైలర్‌పై ప్రశంసలు కురిపించారు. ట్రైలర్ అద్భుతంగా ఉంది. నా ప్రియమైన సోదరుడు అఖిల్ అదరగొట్టాడు అంటూ ఆయన అభినందించారు.



# నా కెరీర్‌లో చెత్త సినిమా అదే.. కానీ అదే నా జీవితాన్ని మార్చింది..



వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన సినీ ప్రయాణం, వ్యక్తిత్వం, విజయాలు, వైఫల్యాలతో పాటు జీవితంపై తన ఆలోచనలను పంచుకున్నారు. ముఖ్యంగా తన కెరీర్‌లో అత్యంత చెత్త సినిమాగా ఏ చిత్రాన్ని భావిస్తారన్న ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తన కెరీర్‌లో అత్యంత నిరాశపరిచిన చిత్రంగా అంతంను పేర్కొన్న వర్మ, ప్రముఖ రచయిత జేమ్స్ హాడ్లీ ఛేజ్ నవల ఆధారంగా తెరకెక్కించిన ఆ చిత్రాన్ని తాను అనుకున్న స్థాయిలో మలచలేకపోయానని చెప్పారు. అయితే, అదే సినిమా తన బాలీవుడ్ ప్రయాణానికి బలమైన పునాది వేసిందని వెల్లడించారు. 'అంతం' ద్వారానే నటి ఊర్మిళ మటోండ్కర్ పరిచయం అయ్యారని, ఆ తర్వాత ఆమెతో కలిసి రూపొందించిన రంగీలా తన కెరీర్‌లో పెద్ద మలుపు తీసుకొచ్చిందని చెప్పారు.

# పురాతన రహస్యాల ఛేదనలో..



నటుడు గణేశ్ కథానాయకుడిగా రూపొందుతున్న ఫిక్షనల్ మూవీ 'పినాక'. ధనంజయ దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈచిత్రం అక్టోబర్ 2న గ్రాండ్‌గా విడుదల కానున్నది. ఆదివారం హీరో గణేశ్ పుట్టిన రోజు.ఈ సందర్భంగా సినిమాలోని ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేసి, శుభాకాంక్షలు అందించారు. పురాతన రహస్యాన్ని ఛేదించడంలో నిమగ్నమైన గణేశ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పురాణాలు, రహస్యాలతో నిండిన అద్భుత ప్రయాణం ఈ సినిమా అని, అన్ని వర్గాలనూ ఆకట్టుకునేలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: కర్మ్ చావ్లా, సంగీతం: గౌర హరి.

## 'బిగ్‌బాస్‌కు నేను సెట్ కాను'.. షో ఎందుకు తిరస్కరించిందో చెప్పిన నాగదుర్గ

ఫోక్ సాంగ్స్, డ్యాన్స్ ప్రదర్శనలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ ఇప్పుడు హీరోయిన్‌గా కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది. ఇదుపు కాయితం చిత్రంతో వెండితెరకు పరిచయం అవుతున్న ఆమె పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాను సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాసు వర్క్స్ బ్యానర్లపై నిర్మిస్తుండగా, ప్రియదర్శి హీరోగా నటిస్తున్నారు. ఇందులో నాగదుర్గ 'శ్రీలత' అనే తెలంగాణ యువతి పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు సినిమాపై ఆసక్తిని పెంచగా, 'ఇదుపు కాయితం' టైటిల్ కూడా సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

## 'ఏజెంట్' తర్వాత నా జీవితమే మారిపోయింది..



అక్కినేని యువ హీరో అఖిల్ అక్కినేని నటిస్తున్న తాజా చిత్రం లెనిన్ జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా అఖిల్ వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సినిమా విశేషాలతో పాటు గత మూడు సంవత్సరాల తన ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన అఖిల్, ఏజెంట్ విడుదలైన మూడు నెలల తర్వాత జరిగిన ప్రమాదం గురించి వెల్లడించారు. పడ్డాయని చెప్పారు. ఈ ప్రమాదం తన వ్యక్తిగత జీవితంతో పాటు కెరీర్‌పైనా తీవ్ర ప్రభావం చూపిందని పేర్కొన్నారు.

# హృద్యమైన కాగితం పడవలు

వర్ధన్, కృష్ణప్రియ జంటగా నటిస్తున్న ప్రేమకథాచిత్రం 'కాగితం పడవలు'. ఎంజీఆర్ తుకారం దర్శకుడు. కీర్తన నరేశ్, టీఆర్ ప్రసాద్‌రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప నిర్మాతలు. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు.తాజాగా ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈ నెల 24న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా సినిమా విడుదల కానున్నది. అందర్నీ అలరించే హృద్యమైన ప్రేమకథాచిత్రమిదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రుద్రసాయి, సంగీతం: ఏబీఎస్ నౌఫల్ రాజా, నిర్మాణం: ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణది క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్.







Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Palleveluguews9@gmail.com